క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. మంచి నీటి సరఫరా విషయంలో పైపులు లీకేజీలు, ట్యాంకుల శుభ్రత, ఇళ్ల సమీపంలో పేడ దిబ్బలు, ఇళ్లల్లో సంపులు శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మదనమోహన్‌రాజు, మోహన్‌రెడ్డి, రామ్మోహన్, సతీష్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

తిరుపతి కల్చరల్: స్వయం ఉపాధితో ప్రతి మహిళ ఆర్థికాభివృద్ధి సాధించి వారి కుటుంబాలకు చక్కటి భరోసాగా నిలవాలని తెలుగు భాషోద్యమ సమితి గౌరవాధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి పిలుపునిచ్చారు. మబ్బు సూర్యనారాయణరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నారెడ్డి కాలనీలో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చెన్నారెడ్డి కాలనీలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎస్ రెడ్డి, సచివాలయం కార్యదర్శి ప్రసన్న, ట్రస్ట్ కో ఆర్డినేటర్ రేవతి, ట్రైనర్ మంజులవాణి, మహిళలు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి



మాట్లాడుతున్న బాధితులు వెంకటసుబ్బమ్మ, జయరామిరెడ్డి

తిరుపతి కల్చరల్: నలభయ్యేళ్లుగా తమ స్వాధీనంలోనున్న 90 అంకణాల స్థలాన్ని కొందరు దౌర్జన్యంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, సంబంధిత అధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి తమ ఇంటిని కాపాడాలని బి.వెంకటసుబ్బమ్మ, ఆమె కుమారుడు జయరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన తన ఇంటి స్థలం కబ్జా వివరాలను వెల్లడించారు. కొర్లగుంట, సంజయ్‌గాంధీ కాలనీ ఇంటి నెంబరు 20-5-746/3లో గత 40 ఏళ్లుగా నివాసముంటున్నామన్నారు. 2000 సంవత్సరంలో టి.రాజేశ్వరి, మునికమలమ్మ అనే వ్యక్తులు స్థలం తమదంటూ కోర్టులో కేసు వేయగా 2005,2009లో రెండు సార్లు తనకే అనుకూలంగా తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. స్థలాన్ని ఎలాగైనా కబ్జా చేయాలని రాజేశ్వరి కుమారుడు గోపీకృష్ణ ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తమ స్థలంలో రేకుల వేసుకుంటుంటే అడ్డుపడుతున్నారని వాపోయారు. పోలీసులతో కుమ్మక్కై ప్రస్తుతం తమ స్థలంలో నిర్మాణాలు చేయనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రగిరిలో ప్రజా ఫిర్యాదుల వేదిక

చంద్రగిరి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించి మొదటి సారి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడంతో తహశీల్దార్, ఎంపీడీఓతో పాటు ఇతర అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 68 అర్జీలు రాగా, అందులో 33 అర్జీలు రెవెన్యూ సమస్యలపై, పింఛన్లకు సంబంధించి 11 అర్జీలు, గ్రామ పంచాయతీలకు సంబంధించి 8 అర్జీలతోపాటు ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అర్జీలను పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులకు అందజేశారు.

హత్య కేసులో నలుగురి అరెస్ట్

తిరుపతి క్రైమ్ : తాగిన మత్తులో ఈ నెల 14వ తేదీన హత్యకు పాల్పడిని నలుగురు నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్టు అలిపిరి సీఐ రామారావు తెలిపారు. వివరాలు.. ఆటోనగర్‌కు చెందిన మాదం ప్రసాద్‌ను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి శెట్టిపల్లె రైల్వే గేట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆటోనగర్‌కి చెందిన కచ్చిలేటి వెంకటేష్, చైతన్యపురానికి చెందిన సుంకర కిరణ్ కుమార్, తమిళనాడుకు చెందిన నీలకంఠంతో పాటు మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తమదైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపడింది. మాదం ప్రసాద్‌ను హత్య చేసింది వీరే అన్న సంగతి వెలుగు చూసింది. నిందితులను రిమాండ్‌కు, బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో తెలంగాణ ఎమ్మెల్సీ సుంకర రాజు, తెలంగాణ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కే రంగారావు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

స్వర్ణవర్ణ శోభితం



గరుడ గిరిపై నుంచి బంగారు వర్ణంతో అస్తమిస్తున్న సూర్యుడు



తిరునగరిని కమ్ముకున్న కారుమబ్బులు

ఆధ్యాత్మిక నగరిలో సోమవారం ఆకాశదేశాన వింత మార్పులు చోటు చేసుకున్నాయి. ఓవైపు నల్ల మబ్బులతో వర్షం కురుస్తుంటే మరోవైపు సాయం సంధ్య వేళ అస్తమిస్తున్న భానుడు గరుడ గిరిపై బంగారు వర్ణంతో శోభించాడు. ఈ అరుదైన దృశ్యాలను చూపరులు తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ , తిరుపతి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ప్రజా ఫిర్యాదులపై సూచనలు చేస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని నగర మేయర్ డాక్టర్ ఆర్ శిరీష అధికారులకు సూచించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలిసి ఆమె ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని చెప్పారు. కమిషనర్ అదితి సింగ్ మాట్లాడుతూ ప్రతి వినతికి సరైన పరిష్కార మార్గాన్ని చూపిస్తామని అన్నారు. అందుకు అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నా క్యాంటీన్లను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ వినతిపత్రం అందజేశారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో అదనంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ ఇప్పటికే మూడు అన్న క్యాంటీన్లు ఖాళీ చేయించామని, మరో వారంలో నాలుగో క్యాంటీన్ స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కర్నాలవీధి రైల్వే అండర్ బ్రిడ్జ్ వద్ద కస్తూరి భాయ్ సందు–పల్లివీధిని కలుపుతూ వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ నరసింహాచారి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమైన ఫిర్యాదుల్లో కైకాల చెరువు వద్ద బోరు పని చేయడం లేదని, తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, చెన్నారెడ్డి కాలనీలోని ప్రభుత్వ బాలికల హాస్టల్లో నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. తిమ్మినాయుడుపాళెం శ్మశానంలో సదుపాయాలు కల్పించాలని, కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలని పలు ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కేవెల్ వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భాకరాపేట: పేకాట స్థావరంపై దాడి చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు భాకరాపేట సీఐ మస్తాన్‌వలీ తెలిపారు. ఎస్‌బీ ఏఎస్‌ఐ దస్తగిరికి అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడులు జరిపినట్లు సీఐ పేర్కొన్నారు. సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భాకరాపేట సర్కిల్ పరిధిలోని ఎర్రావారిపాళెం మండలం నెరబైలు సమీపంలోని మామిడి తోపులో భారీగా జూదం జరుగుతుండగా భాకరాపేట ఎస్ఐ విజయ్‌కుమార్‌నాయక్, సిబ్బందితో కలసి దాడి చేశారన్నారు. ఎస్‌బీకి అందిన సమాచారం కచ్చితంగా ఉండడంతో మూకుమ్మడిగా చుట్టుముట్టినట్లు తెలిపారు. ఈ దాడుల్లో తిరుపతికి చెందిన బాబురెడ్డి, మురళీరెడ్డి, అశ్విత్ రెడ్డి, నరేష్, ప్రకాష్, మునస్వామి, సాయిశేఖర్, లక్ష్మణరెడ్డి, ప్రభాకర్, పట్టాభి, సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. పేకాట స్థావరం వద్ద రూ.70,000 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 3 ద్విచక్ర వాహనాలు, ఒక కారు, స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన మరో 10 మంది కోసం గాలిస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్, ఎస్‌బీ ఏఎస్ఐ దస్తగిరి, భాకరాపేట పోలీసులు పాల్గొన్నారు.

భారీగా జూదం

రెండు నెలలుగా భాకరాపేట సర్కిల్ పరిధిలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల పరిధిలో లక్షల్లో పేకాట జరుగుతుంది. ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఉన్నా అడపాదడపా దాడులు చేస్తున్నారు తప్ప నివారించలేక పోతున్నారు. పేకాట ఆడిస్తున్న వారి గురించి సమాచారం ఉన్నా పోలీసులు పట్టించుకోవడం లేదని జోరుగా ప్రచారం సాగుతోంది. చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్, తిరుపతి జిల్లాల నుండి పేకాటరాయుళ్లు వచ్చి ఒక్కో ఆట రూ.లక్షల్లో సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పేకాట స్థావరం వద్దే వడ్డీకి డబ్బులు ఇచ్చేందుకు వడ్డీ వ్యాపారులు సైతం రావడం విశేషం.

పింఛన్ల పంపిణీ ఉద్యోగులకు భారం

తిరుపతి కల్చరల్: పెన్షన్ పంపిణీ చేసేందుకు వలంటీర్లను దూరం పెట్టి సచివాలయ ఉద్యోగులపై భారం వేయాలని సోమవారం మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం విడ్డూరమని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎన్.రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, వార్డు, సచివాలయ వ్యవస్థను ఎలాగైనా ప్రజల నుంచి దూరం చేయాలని చూడడం దారుణమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం కారణంగా రాష్ట్రంలో ఐదు లక్షల మంది వలంటీర్లు చేసే పని కేవలం లక్షా 40 వేల మంది ఉద్యోగులతో చేయించాలని అనుకోవడం అవివేకమని తెలిపారు. సచివాలయ వ్యవస్థలో పని చేసే ఉద్యోగస్తులు కూడా చాలా మంది పెన్షన్ పంపిణీకి విముఖత చూపుతున్నారని, వారిలో కూడా కొంత మందిపైన మాత్రమే భారం పడే అవకాశం ఉందని తెలిపారు. సచివాలయంలో వలంటీర్లకు నెలకు రూ.10 వేలు జీతం ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు ఆ వ్యవస్థని ఎత్తివేయడం దారుణమని పేర్కొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

చంద్రగిరి: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యువకుడి ఆచూకీ లభించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు ఎగువ కూచువారిపల్లికి చెందిన శ్రీకాంత్(25)గా గుర్తించినట్లు తెలిపారు. మృతుడికి చెందిన బంధువులు వివరాలను వెల్లడించారన్నారు. మృతుడికి భార్య, ఏడాది కుమార్తె ఉన్నారన్నారు. మృతుడి మెడ వద్ద గాయం ఉండడంతో అనుమానాస్పద స్థితిలో మృతి కింద కేసును పోలీసులు నమోదు చేశారు. బంధువులు మృతదేహాన్ని గుర్తించడంతోపాటు వారి ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

శేషాచలంలో వేట ప్రారంభం



కణితి మాంసం, నాటతుపాకీతో అటవీ అధికారులకు పట్టుబడ్డ వేటగాళ్లు

- విజృంభిస్తున్న వేటగాళ్లు
- కరోనా తర్వాత మొదలైన తూటా శబ్దాలు
- శేషాచలం అడవుల్లో వేటగాళ్ల తిష్ట

భాకరాపేట: శేషాచలం అడవుల్లో వేటగాళ్లు విజృంభిస్తున్నారు. కరోనా ప్రారంభం నుండి అడవిలో జంతువుల వేట ఆగిపోయింది. ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నం కావడంతో వేటగాళ్ల కలకలం మొదలైంది. అప్పటి నుంచి అటవీ జంతువుల వేట ప్రారంభమైంది. కరోనా నుంచి వర్షాలు ఆశించిన దానికంటే ఎక్కువగా పడడంతో అడవులు బాగా అభివృద్ధి చెందాయి. కరోనా కాలంలో వేటగాళ్లు కూడా వేటకు టాటా చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో అడవుల గురించి అధికారులు మరచిపోవడంతో ప్రారంభమైన వేట రోజు రోజుకు పెరుగుతోంది. భాకరాపేట, కల్యాణిడ్యాం, దేవరకొండ, తలకోన అటవీ ప్రాంతాల్లో వేటగాళ్లు తరుచూ నాటు తుపాకులతో జంతువులను వేటాడుతున్నారు. భాకరాపేట అటవీ కార్యాలయానికి ఆదివారం అందిన రహస్య సమాచారం మేరకు భాకరాపేట అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపుల్లో వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె శికారికాలనీ చెందిన ఎస్.సురేష్, ఎస్.శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి ఒక ద్విచక్ర వాహనం, నాటు తుపాకీ, కణితి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీరిని పీలేరు కోర్టులో హాజరు పరిచినట్లు భాకరాపేట రేంజర్ దత్తాత్రేయ తెలిపారు. పట్టుబడ్డ వారు ఇచ్చిన సమాచారం మేరకు మిగిలిన వేటగాళ్ల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

శేషాచలంలో వేటగాళ్ల తిష్ట

శేషాచలం అటవీ ప్రాంతంలో వేటగాళ్లు తిష్ట వేసినట్లు అటవీ అధికారులకు సమాచారం ఉంది. ఈ సమాచారం మేరకు చంద్రగిరి శ్రీవారి మెట్టు నుండి చిన్నగొట్టిగల్లు మండలం అటవీ సరిహద్దులు, ఎర్రావారిపాళెం మండలంలోని తలకోన అటవీ ప్రాంతం, ఉస్తికాయలపెంట అటవీ సరిహద్దుల వరకు వేటగాళ్లు జాడ కోసం ప్రత్యేకంగా నిఘా పెట్టినట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. వేటగాళ్లు బయట ప్రాంతాల నుండి వస్తున్నారు. దీంతో నాటు తుపాకుల మోత అటవీ ప్రాంతంలో కలకలం రేపుతోంది.

యునిమోని సర్వీసెస్ శాఖ ప్రారంభం



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న యునిమోని ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఫారిన్ ఎక్స్ఛేంజ్, నగదు బదిలీ సేవలు అందించే నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ యునిమోని సర్వీసెస్ శాఖను ఎయిర్ బైపాస్ రోడ్డులోని డీ మార్ట్ ఎదురుగా ఉన్న కొత్త భవన్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ సీఏ కృష్ణన్ మాట్లాడుతూ తిరుపతిలోని కస్టమర్ల సౌకర్యార్థం అందరికీ అందుబాటులో ఉన్న ప్రాంతంలో ఈ నూతన శాఖను ఆరంభించామని తెలిపారు. సంస్థ అందించే విదేశీ కరెన్సీ సేవలు, విదేశాలకు నగదు పంపడం, విదేశీ కరెన్సీ కార్డు, బంగారు ఆభరణాలపై రుణాలు, విమాన ప్రయాణ టిక్కెట్లు, టూర్స్, నగదు బదిలీ, వినియోగ చెల్లింపులు తదితర సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రారంభోత్సవం సందర్భంగా స్టూడెంట్ స్టార్ క్యాంపెన్‌లో భాగంగా లక్కీడిప్ ద్వారా ద్వితీయ విజేతగా నిలిచిన తిరుపతికి చెందిన సాయిమానిశాంత్‌కు లక్షా 50 వేలు నగదు బహుమతిని అందజేశారు. కంపెనీలో స్కాలర్‌షిప్ కోసం వారి వివరాలను నమోదు చేసుకున్న వారికి త్వరలో రెండో విడత విజేతలకు మరింత ఎక్కువ స్కాలర్‌షిప్ అందిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ అందజేశారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ

రామచంద్రాపురం: బాల్య వివాహాల నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, పావనిశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని మిట్టూరు గ్రామంలో అంగన్‌వాడీ బడిబాట, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనంలోనే పెళ్లి చేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి చేసేందుకు సిద్ధమైతే స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తకు లేదా చైల్డ్‌లైన్ నెంబర్ 1098కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది వాణిశ్రీ, గీత, ఐఈఆర్పీ రాజేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీట్ స్కామ్‌పై విచారణ చేపట్టాలి



దండి మార్చ్ సర్కిల్ వద్ద పీడీఎస్ఓ నిరసన

తిరుపతి సిటీ: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ స్కామ్‌పై తక్షణం సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్ఓ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్ ఉష డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్ పల్లి దండి మార్చ్ సర్కిల్ వద్ద పీడీఎస్ఓ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిహార్, గుజరాత్ రాష్ట్రాలలో జరిగిన నీట్ స్కామ్‌పై ప్రధాని నోరు మెదపకపోవడం దారుణమన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలు రోడ్డు పాలు చేయడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, తిరిగి నీట్ పరీక్షను వెంటనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలనానరు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్ఓ నాయకులు త్రివేణి, సుచిత్ర, పెద్ద సంఖ్యలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం రూ.20 వేలు చెల్లించాలి

తిరుపతి అర్బన్: ఖరీప్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి భరోసాగా ప్రభుత్వం అందిస్తామని హామీ ఇచ్చిన రూ.20 వేలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం రైతు సంఘం నేతలతో కలసి ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర.హెచ్‌ఎంకు వినతిపత్రాన్ని అందించారు. పెట్టుబడి సాయం సకాలంలో అందించకపోతే రైతులు అప్పులు చేసి పెట్టుబడులు తెచ్చుకోవాల్సి ఉందని వెల్లడించారు. కొందరు రైతులకు అప్పులు చేయడానికి అవకాశం లేకపోవడంతో సేద్యం చేయలేక భూములు బీడు పెట్టాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆమె వివరించారు. ఈ క్రమంలో రైతులతోపాటు కౌలు రైతులకు అండగా ఉండాలని కోరారు. అంతేకాకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు బ్యాంక్‌ల నుంచి రైతులకు అందాల్సిన క్రాప్ రుణాలు జాప్యం లేకుండా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వివరించారు. అంతే కాకుండా గతంలో చెరకు రైతులకు ఫ్యాక్టరీల యజమానులు బకాయిలు ఉన్నారని వాటిని చెల్లించాలని కోరారు. ఆ మేరకు ఓ వినతిపత్రాన్ని అందించారు. ఆమెతోపాటు రైతు సంఘం నేతలు పురుషోత్తంరెడ్డి, పి.భాస్కర్ నాయుడు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నేత పి.వెంకటరత్నం

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోనున్న లక్షలాది మంది భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ సీనియర్ నేతలు పి.వెంకటరత్నం, ఆర్.వెంకయ్య డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సోమవారం ఏపీ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూలి పనులు చేసుకుని జీవించే భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కార్మికుల పూర్తి వివరాలను లేబర్ అధికారులు సేకరించి ఎప్పటికప్పుడు వారికి ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. అనంతరం నగరంలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించారు. త్వరలోనే కార్మిక శాఖ అధికారులను కలిసి సమస్యలను పరిష్కరించుకునే దిశగా కృషి చేస్తామని తెలిపారు.

పీఎస్–4లో మరోమారు తనిఖీలు



పీఎస్-4లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ, ప్రజారోగ్య శాఖ అధికారులు

తిరుపతి తుడా: ప్రముఖ పీఎస్–4 హోటల్లో యాత్రికులకు వడ్డించిన ఆహారంలో విషపు జెర్రి వెలుగు చూసిన ఉదంతం సంచలనం సృష్టించింది. దీనిపై ఫిర్యాదులు అందడం, ఫిర్యాదిదారులు, ఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాపై దౌర్జన్యానికి దిగిన పీఎస్ 4 హోటల్‌పై మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య విభాగం కఠినమైన చర్యలకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పీఎస్–4 హోటల్‌కు రూ.50 వేల భారీ జరిమానా విధించింది. గడిచిన నాలుగు రోజులుగా రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. ఈ క్రమంలో తమ ఇకపై ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని యాత్రికులకు నాణ్యమైన వంటకాలు అందిస్తామని హామీ ఇవ్వడంతో పీఎస్–4ను తెరిచేందుకు సోమవారం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మరోమారు కిచెన్ పరిసర ప్రాంతాలు, వంటలకు ఉపయోగించే పదార్థాలు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ హోటళ్లలో నాణ్యమైన వంటకాలను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇకపై నాణ్యమైన వంటలను అందిస్తామని హామీ ఇవ్వడంతో కమిషనర్ ఆదేశాల మేరకు పీఎస్–4ను తెరిచేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. నాణ్యమైన వంట సామగ్రి, కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. పీఎస్–4లో రెండు రోజులకు ఒక మారు పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని, గోడలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, కిచెన్‌లో మూతలు కలిగిన పాత్రలు వాడాలని సూచించామని అన్నారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిలేటి, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి తనిఖీల్లో పాల్గొన్నారు.